

# అమెరి'కాకమ్మ'కథలు

## వంగూరి చిట్టెన్ రాజు



## ఆలస్యం అమృతం సన్మానం

### అమెరికాకమ్మ కథలు- 14

ప్రపంచంలో నాకూ, క్వీన్ విక్టోరియాకీ తప్ప ఇంకెవరికీ తెలియని పరమ రహస్యం ఒకటి ఇవాళ ఎందుకో ప్రపంచంలో అందరికీ చెప్పెయ్యాలనిపిస్తోంది. అదేమిటంటే ఎప్పుడైనా నాకు తోచనప్పుడు కుతూహలం కొద్దీ కొన్ని సార్లూ, పాత విషయాలు చిదంబరం గారి ప్రకటనల్లా సూత్రప్రాయంగానే గుర్తుకి వచ్చి, స్పష్టత కోసం కొన్ని సార్లూ ఆ రెండింటిలోకీ చూస్తూ ఉంటాను. ఆ రెండూ మా ఇంట్లో ఉన్నాయని నాకూ, క్వీన్ విక్టోరియాకి తెలిసిన రహస్యం. అందులో ఒకటేమో భ.భూ. రెండోదేమో భూ.భూ. నేను ఎంతో కష్టపడి సంపాదించుకున్న ఆ రెండూ చూడ్డానికి మామూలు భూతద్దాల లాగా ఉంటాయి కానీ ఒకటేమో భవిష్యత్తునీ, మరొకటేమో భూతకాలాన్నీ చూపిస్తుంది. వర్తమానం మటుకు మా క్వీన్ విక్టోరియా మామూలు అద్దంలోనే టైమున్నపుడల్లా నా సుందరవదనారవిందాన్ని నాకే చూపించి, ఈ మాత్రం దానికి వేరే భూతద్దం కూడా ఎందుకూ అని ఉసూరుమంటూ ఉంటుంది.

మొన్న ఒకరోజు నేను "పనిలేని మంగలి" మూడ్‌లో ఉండి, ఇంకో పదేళ్ళలో అమెరికాలో తెలుగు సంఘాలెన్ని ఉంటాయీ, ఎందుకుంటాయీ అని కుతూహలం వేసి, నా భ.భూ అనగా, భవిష్యత్తు భూతద్దం పెట్టుకుని చూస్తుంటే అందులో రాష్ట్ర విభజన జరగగానే భాష విభజన కూడా జరుగుననియూ , తెలంగాణా అనే భాషని భారత ప్రభుత్వం అధికార భాషగా గుర్తిస్తుందనీ స్పష్టంగా కనపడి భయాందోళనలకి గురవ్వాలో, ఆనందాశ్చర్యాలు వెలిబుచ్చాలో తెలియక అలా చూస్తూ ఉండిపోయాను. ఇంతలోకే కెమేరామన్ "యాద్గిరితో యాదగిరి" తో మాట్లాడుతున్న ఒక యూనివర్శిటీ ప్రొఫెసర్ గారు నా భూతద్దంలోకి వచ్చేసి "దేశభాషలందు తెలంగాణా లెస్స" అనే మాట అసలు రాయల వారు తమ భాష గురించే వ్రాశారనీ, దాన్ని ఆంధ్రా వాళ్ళు యధాప్రకారం కబ్జా చేసేసుకుని ప్రాచీన భాషా ప్రతిపత్తి కొట్టేశారని, దాన్ని ఇప్పుడు విడగొట్టి తెలంగాణా భాషకి కూడా పంచిపెట్టాలనీ ధర్నా చేస్తున్నారు.

ఆయన్ని అలా భూతద్దంలో చూడగానే నాకు వెంఠనే ఈయన్నో, ఈయనలాగా ఉండి, తనకి అవగాహన లేని విషయాలపై తన మనోభావాలని ప్రకటించిన మరొక ప్రొఫెసర్‌నో ఎక్కడో చూసినట్టు ఉన్నానే అని అనుమానం వేసి, పక్కనే ఉన్న నా భూ.భూ ని, అంటే జరిగిన భూతకాలాన్ని కూడా చూపించే భూతద్దాన్ని కూడా తీసి, తుడిచి అందులో తీక్షణంగా చూశాను. హా తెలిసెన్! పదేళ్ళ క్రితం మా ఇంటికి వచ్చిన ఒకానొక విశ్వవిద్యాలయ ఉన్నతాధికారి ఇటువంటి వాడే!. నా అమెరికా జీవితంలో నేను సగౌరవంగా ఆహ్వానించి, అడ్డమైన తిట్లూ తిన్న కేసు ఇదొక్కటే!.

ఆయన అసలు వృత్తి తెలుగు బోధించే ఆచార్యులే కానీ, కొన్నాళ్ళపాటు పాఠం చెప్పడం మానేసి ఈ పెద్ద పాఠశాల నిర్వహించూ అని ఆయన్ని ఈ పదవిలో నియమించారుట. అఫ్‌కోర్స్, అటువంటి వారు వారంతట వారు అక్కడ ఎంత గొప్పవారైనా

ఇక్కడకి, అంటే అమెరికా అంత సులభంగా రారు, లేదా రాలేరు కదా! మనమే వారిని పిలవాలి. అన్నట్టు, ఈ అఫ్‌కోర్స్ అనే అంగ్రేజీ మాటకి తెలుగులో ఏమంటారో నాకు తెలియదు. తెలంగాణాలో దానికేమయినా సరి అయిన మాట ఉందేమో ఈ పెద్దాయన్ని అడగాలి.

ఇంతకీ అప్పుడేమయిందంటే, నేను యధాప్రకారం ఆయన్ని రిసీవ్ చేసుకోడానికి మా ఎయిర్ పోర్ట్‌కి వెళ్ళాను. అమెరికా చలి భరించ లేక బిగుతుగా వేసుకున్న కోటూ, మెడ చుట్టు ఎర్ర మఫ్లరూ, గుడ్లగూబలా కేవలం రెండు కళ్ళూ మాత్రమే కనపడే తలకాయ నుంచి గెడ్డం దాకా కప్పేసే ఊలు టోపీతో దిగిన ఈ చామన చాయ ప్రొఫెసర్ గారు నన్ను చూడగానే అమ్మయ్య అనుకుని ఆనందపడి కళ్ళు మిటకరించాడు కానీ, నా చుట్టు చూసి మొహం అదోలా పెట్టారు. మామూలుగానే మా ఇంటికి తీసుకొచ్చి మా గెస్ట్ రూం లో బస ఏర్పాటు చేశాం. ఆ మర్నాడు ఆయన ప్రసంగించ వలసిన సభలకి తీసుకెళ్ళి మాకు ప్రత్యేకించబడిన మూడో వరసలో కూచోపెట్టాను. ప్రారంభోత్సవ కార్యక్రమం అయ్యాక ప్రసంగాల సమయంలో వరస ప్రకారం గురువుగారిని పిల్చారు. ఆయన ఇబ్బంది పడుతూ స్టేజి మీదకి వెళ్ళి, మళ్ళీ చుట్టూ చూసి, ఎవరూ సైడ్ వింగ్స్ లోంచి వచ్చి దండ పట్టుకుని రాకపోడంతో మొహం ఎయిర్ పోర్ట్‌లో కంటే అదోలా పెట్టి రాసుకొచ్చిన ఉపన్యాసం చదివేసి విసుగ్గా వచ్చేసి నా పక్కనే కూచున్నారు.

"ఏం అయింది సార్" అని అడిగాను వారి "ఆముద" ముఖారవిందాన్ని గమనించి. తెలుగులో నాకు ఈ "ఆముదం" అనే మాట అంటే ఇష్టం. ఎందుకంటే "ముదం" అంటే ఆనందం అనియూ, దానికి ముందు ఒకే ఒక్క అక్షరం "ఆ" తగిలిస్తే ఈ ప్రొఫెసర్ గారి మొహంలో శాశ్వతంగా ఉన్న ఫీలింగనీ అర్థం మారిపోతుంది కదా!

"మనం వచ్చిన పని అయిపోయింది కదా! ఏదైనా కాస్త ఊరు చూపించు. దారిలో చెప్తాను." అన్నారు ఆ.మొ. గారు.

"బయటకి వెళ్ళి పోదామా? కుదరదు సార్, ఇలాటి సభలలో సాయంత్రం దాకా ఉండాలి. అందులోనూ మీరు ఇండియానుంచి వచ్చిన ప్రత్యేక అతిథి కదా. బావుండదు." అన్నాను.

"నా మొహం లాగా ఉంది ఇక్కడి పద్ధతి. ఇండియాలో అయితే మన స్పీచ్ ఇచ్చేశాక, మిగతా వాళ్ళ చెత్త వినడానికి క్షణం కూడా అక్కడ ఉండం. పోనీ అలా వెళ్ళి ఏదైనా కొట్లో టీ తాగొద్దాం పద" అని లేచారు సారు.

"అవన్నీ ఇక్కడే ఎక్కడో ఉంటాయి, సార్" అని హాలు బయట ఉన్న హాలులో కోకులూ, టీ మరియు కాఫీలూ పెట్టే బల్ల దగ్గరకి వెళ్ళగానే, వారు "ఒద్దులే. మీ వెధవ దేశంలో కాఫీ కూడా నా మొహంలా ఉంటుంది" అని ఆయన అనగానే నిజంగా ఉన్న మాటే చెప్తున్నారు కదా అని అనుకుని ఆయన సత్య సంధతని మెచ్చుకున్నాను.

కానీ ఇక ఉండబట్ట లేక "అయ్యా, మీరు వచ్చిన దగ్గరనుంచీ ఘుమ ఘుమ, అనగా తమరు రాసుకొంటున్న దేశవాళీ సెంటూ, సిల్కు లాల్చీ బాగానే ఉన్నాయి కానీ తమరి ముఖారవిందం మటుకు ధుమ ధుమ లాడుతూనే ఉంది. మీరు కవులు. కావడానికి ఉద్దండ పందితులేమో కూడానూ. నా వలన ఏమైనా పొరపాటు జరిగిందా? అవధరింపుము." అని అడిగాను. ఇక్కడ, అంటే ఈ వాక్యం కంప్యూటర్‌లో టైపు కొట్టి చూడగానే నాకే నవ్వొచ్చింది. ఎందుకంటే, ఈ రోజుల్లో తెలుగు కావాలంటే అంగ్రేజీలోనే టైపు కొట్టాలి కాబట్టి నేను "pamDitulu" బదులు పొరపాటున "pamditulu" అని జోరుగా ఒఖ్ఖ అక్షరం తప్పుకొట్టగానే కొట్టగానే అది నిర్దాక్షిణ్యంగా తెలుగులో "పండితులు" బదులు "పందితులు" అని పడింది. తెలిసో తెలియకో దేవుడు మన చేత తప్పు టైపు కొట్టించినా, అది భలే అతుక్కుపోతుంది కొన్ని విషయాలలో!

నేను అడిగిన ప్రశ్నకి ఆయన "మీ అమెరికా వాళ్ళు చేసే పనులకి అలా ఉండక ఇలా ఉంటానా?" అని వేళాకోళంగా ఒక వికటాట్టహాసం చేసి పడేశారు. తరువాత మేము కారులో ఎక్కిన దగ్గరనుంచి, నేను ఎక్కడికీ పారిపోవడానికి వీల్లేదు కాబట్టి ఆయనకి

దొరికాను. అప్పుడప్పుడు మా ఆవిడకి కూడా అలాగే దొరికి పోయి, రోల్ రివర్స్ అయిపోయి నా మొహం కూడా ఇప్పటి "పందితులు" గారి మొహం వలెనే పరిఢవిల్లుతూ ఉంటూ ఉంటుంది.

"మీ అమెరికా వాళ్ళకి కల్చరంటే తెలియదు అనుకో. ఒప్పుకుంటాను. నువ్వు ఆంధ్రా వాడివే కద! నా అంతటి వాడు వచ్చినప్పుడు ఎయిర్‌పోర్ట్‌కి నువ్వు ఒక్కడివీ లింగు, లింగుమంటూ వస్తావా? మిగిలిన నిర్వాహకులూ, మీ తెలుగు సంఘం నాయకులకీ ఆ మాత్రం మర్యాద తెలియదా? ఏమయ్యాడు మీ ప్రెసిడెంటూ?" ఆడిటోరియం హాలు దగ్గర కారు ఎక్కిన తరవాత మా ఇంట్లో డైనింగ్ హాలుకి వచ్చేదాకా జరిగిన స్క్రీన్ ప్లేలో ఇది మొదటి షాట్. ఈ షాట్‌లో ఆయన ఎయిర్ పోర్ట్ లో దిగగానే ఆ.మొ. పెట్టడానికి మొదటి కారణం తెలిసి పోయింది.

"అది కాదు, సార్. అందరికీ పనులు ఉంటాయి కదా! పైగా ఏదో సినిమా తారలకీ, మంత్రులకీ అయితే పదిమందికి పైగా...!.." ..పొరపాటున అమెరికా తెలుగు సంఘాల సంస్కృతి గురించి చెప్పడానికి సాహసించాను మరింకేం చెప్పాలో తోచక.

"అదిగో, అక్కడే నాకు మండుతుంది. నేను ప్రభుత్వ ఉన్నత విద్యాధికారిని. అంటే నాలుగు కోట్ల తెలంగాణా మరియు మరికొన్ని కోట్ల సీమాంధ్ర వాళ్ళకి నేను ప్రతినిధిని. అందులోనూ మేధావిని. నా క్రింద ఎనభైమంది ప్రొఫెసర్లు పనిచేస్తున్నారు. అంతటి హై లెవెల్ వాడికి గజమాల వెయ్యకపోతే మానె, కనీసం పుష్ప గుచ్చాలతో అయినా వచ్చావా? మీ అమెరికాలో పువ్వులు వాసన వెయ్యవనుకో. అయితే మటుకు? "

"అవుననుకోండీ, కానీ ఒక్కొక్క గుచ్ఛమునకూ వాల్ మార్ట్‌లో కూడా ఆరు డాలర్లు అవుతుంది గదా. మా అసోసియేషన్‌కీ, నాకూ అంత బడ్జెట్ లేదు సార్. పైగా, మా క్వీన్ గారికి కొనకుండా మీకు పువ్వులు కొంటే ఏమన్నా కొంప...."

"అది సరే. మీ ఊళ్ళో న్యూస్ పేపర్లూ, టీవీలూ లేవా? ఒక్క వెధవా ఎయిర్ పోర్ట్‌కి రాలేదేం? ప్రపంచంలోని అతి పెద్ద ప్రజాస్వామిక వ్యవస్థ నుంచి విశ్వవిద్యాలయ ఉన్నతాధికారినైన నేను, అందులోనూ కవి పందితుణ్ణి...సారీ పండితుణ్ణి వస్తున్నట్టు వాళ్ళకి చెప్ప లేదా?"

"సారీ సార్, ఏదో విమానప్రమాదమో, భూకంపమో వచ్చినప్పుడు అమెరికా రిపోర్టర్లు అక్కడికి వెడతారు తప్ప, మిగిలిన సందర్భాలలో..నాకు అసలు అలాటివి తెలియవు సార్. నా జన్మలో నేను ఇప్పటి వరకూ అమెరికాలో విలేఖర్లు ఎలా ఉంటారో చూడ లేదు సార్..."

"అవునూ, ఏదో పాతికేళ్ళనుంచీ పెద్ద అమెరికాలో ఉన్నానూ అంటావు. ఏమిటి, నీ కారు నువ్వే డ్రయివు చేసుకుంటున్నావు. డ్రైవర్ లేడా? పోనీ, నేను ఉన్న నాలుగు రోజులో ఒకణ్ణి పెట్టలేకపోయావా?"

"అమ్మ బాబోయ్, నాలుగు రోజుల పాటు అమెరికాలో డ్రైవరే?" చేతిలోంచి నా కారు స్టీరింగు పట్టుతప్పింది.

"నా లాంటి గెస్ట్‌లు వస్తే నీ చిన్న కుటీరంలో మూల గదిలో పడుకోమంటావా? ఏం? మీ ఊళ్ళో ఫైవ్ స్టార్ హోటళ్ళు లేవా?".

"లేకేం, ఉన్నాయండి. నేనెప్పుడూ వాటిల్లో ఉండలేదు కానీ, ఒక్కొక్క స్టార్ కీ వందో, వెయ్యో ఖర్చు అవుతుందిటండి..."..

"సరేలే, మాట్లాడితే డబ్బో, డబ్బో అని ఏడుస్తావు కానీ, ఇందాకా అసలు ప్రారంభోత్సవం వేదిక మీద తద్దినం బ్రాహ్మల్లాగా ఇద్దరో, ముగ్గురో ఉన్నారేమిటి? అదే మన ఇండియాలో అయితే పెళ్ళి భోజనాలలాగా మూడు వరసల కుర్చీలూ, మధ్యలో నాలాటి వాడు కూచోడానికి పట్టు వస్త్రం కప్పిన సింహాసనమూ ఉంటాయి. ఛ, ఛ, మరీ అంత చచ్చుగానా ఓపెనింగ్ సెరిమనీ? "

"అవునండి. మీరు కరెక్టే. ఆ అమెరికా పద్ధతి మన వాళ్ళకి నచ్చక ఈ మధ్యనే పాతిక కుర్చీల పద్ధతి ఇక్కడా ప్రవేశపెట్టారు దేశవాళీ సభలలో. శాలువాలు కూడా కప్పుతున్నారండి అందరికీ. మొన్ననే వైట్ హౌస్‌లో దీపావళి సభలో ఒబామా గారికి పట్టు శాలువా

కప్పగానే, ఇది అప్పటికప్పుడు వేసుకోవాలి కాబోసు అనుకుని ఆయన కోటూ, బనీనూ విప్పెయ్యబోయారండి. ఇంకా నయం, మన వాళ్ళు పంచెల చాపు పెట్టారు కాదు. కొంప మునిగిపోను''.

ఈ విధంగా మేము మనసు విప్పి మాట్లాడుకుని చాలా ఏళ్ళయింది. ఇప్పుడాయన నా భ.భూ లో కనపడగానే నా మొహం కూడా ఆ.మొ. అయిపోయిందేమో అని అనుమానం వచ్చి మా ఆవిడ తాలూకు ఫేవరెట్ వర్తమాన నిలువుటద్దం ముందుకి వెళ్ళి నా మొహం చూసుకుంటూంటే ''ఏం, మొహం అలా వెలిగిపోతోంది? మొన్న జరిగిన దానికే?'' హఠాత్తుగా వెనకనుంచి వినిపించింది మా క్వీన్ విక్టోరియా గొంతుక.

''అవును సుమా, దాని సంగతి మర్చేపోయాను'' అని పైకి అన్నా, నిజంగా మొన్న జరిగిన సంగతి ఇంకా మర్చిపోలేదు.

ఇంతకీ ఆ సంగతి ఏమిటంటే, మా హ్యూస్టన్ తెలుగు సాంస్కృతిక సమితి వారికి ఎందుకో తెలియదు కానీ నాకు సన్మానం చెయ్యాలని కోరిక కలిగి, మొన్న సంక్రాంతి ఉత్సవాలలో ఆ  కార్యక్రమం ఏర్పాటు చేశారు. సన్మానాల విషయంలో నాకో చిన్న పోలిసీ ఉంది. అదేమిటంటే, నాకు సన్మానం చేస్తావా, చస్తావా అని ఎవరినీ బాధించను కానీ, ఎవరైనా సత్కరిస్తానంటే ముందు కొంచెం పోజు కొట్టినా, తరవాత ఒప్పేసుకుంటాను, వాళ్ళు మనసు మార్చుకునేలోపుగా. ఇప్పటిదాకా నాకు అమెరికాలో కానీ, ఇండియాలో కానీ జరిగిన చిన్నా, చితకా సన్మానాల మీద జోకులు వెయ్యడమే కానీ మా క్వీన్ విక్టోరియా నాకు జరిగిన ఏ ఒక్క సన్మానమూ చూడలేదు. రాణీ గారి మూడ్ ఎలా ఉందో కానీ, ఈ సారి నేను అడగగానే ఈ ప్రొగ్రాముకు వచ్చుటయే కాక, ఆ టైములో స్టేజి మీదకి కూడా వచ్చి నన్నూ, ఆర్గనైర్లనీ, ఆడియన్సునీ ఆనందపెట్టారు.

బాపూ గారు వేసిన నా బొమ్మా, దాని చుట్టూ ముళ్ళపూడి రమణ గారూ, గొల్లపూడి వారూ, సత్యం మందపాటి గారూ, ''కళాప్రపూర్ణ'' డా. అనసూయా దేవి గారూ వ్రాసిన సందేహాలతో ..సారీ...సందేశాలతో ఒక పెద్ద సైజు సన్మాన పత్రమూ, ప్రస్తుతం ఆస్టిన్‌లో ఉన్న అతి గొప్ప చిత్రకారుడైన ఆర్టిస్ట్ చంద్ర చేత వేయించిన నా కార్టూన్ బొమ్మా, నాతో రకరకాల ''వేషాలు'' వేసిన ఆపులు రత్నపాప, అనిల్ కుమార్ చాలా కష్టపడి నా మీద తయారు చేసిన ప్రత్యేక డీవీడీ ప్రదర్శనా, మోతాదు మించకుండా నన్ను పొగిడిన జితేందర్, అనుకోకుండా మా ఊరు వచ్చిన సుప్రసిద్ధ కథకుడు ''నాసీ'' మొదలైన నలుగురైదుగురుల ప్రసంగాలూ అన్నీ కలిపి ఈ సన్మానం ''తాకిడి'' కి నన్ను గురిచేసిన ఆత్మీయులందరికీ, ముఖ్యంగా మా సమితి అధ్యక్షులు రామ పాకాల, సుధేష్ పిల్లుట్ల కీ నా ధన్యవాదాలు.

మరొక విశేషం ఏమిటంటే సాధారణంగా ఎవరికైనా సన్మానం అయ్యాక ''ఇప్పుడు మిస్టర్ సన్మానగ్రహీతుడి గారి స్పందన వింటారు'' అని మైకు చేతిలో పెట్టేస్తారు కదా! దానికి సదరు సన్మాన గ్రహీతుడు గారు సీరియస్ అయిపోయి తను నిజంగానే గొప్పవాడనుకుని సీరియస్ మాట్లాడెయ్యడమో, ముందే రాసుకొచ్చిన మూడు పేజీ చదివెయ్యడమో చేస్తాడు కదా! సన్మానగ్రహీతుడిగారి స్పందన అంటే అసలు అర్థం ఏమిటంటే, ''ఈ సన్మానానికి నీ సమాధానం ఏమిటీ'' అని కోర్టులో ముద్దాయిని సంజాయిషీ అడిగినట్లు అడుగుతారనమాట. అందుచేత నేను మొన్న సభలో కూడా ''ఇలాంటి పొరపాట్లు మళ్ళీ చేయనూ'' అనేసి ఏవో తోచిన జోకులూ, వెకిలి వేషాలూ వేసేశాను. అందువలన కనుచూపు మేరలో మళ్ళీ ఇటువంటి సన్మానం నాకు జరగదని నా భూ.భూ కానీ, భ.భూ కానీ చూస్తే తెలుస్తుంది.

అన్నట్టు నిన్న సాయంత్రం మళ్ళీ నేనూ మరియూ మా ఆవిడా ''పనిలేని మంగలి'' మూడ్‌లో ఉండి, ''నమో వెంకటేశా'' అనే కొత్త తెలుగు సినిమాకి వెళ్ళాం. ఆ సినిమా ఎందుకు తీశారో నాకైతే అర్థం అవలేదు కానీ అక్కడ ఒకాయన కనపడి ''మీ గురించి

అందరికీ తెలుసు అనుకోండి, మీకు ఈ సన్మానం ఆలస్యమైనా అది అమృతమే సార్. మొన్న సన్మానంలో కూడా ఆఖర్న అంతా కామెడీ చేసేశారు." అన్నాడు.

"అవును సార్, ఈ సన్మానాలూ, ఈ మధ్య ఇస్తున్న సాహిత్య ఎకాడెమీ ఎవార్డులూ, సమోసాలూ అన్నీ కామెడీలే కదా?" అన్నాను సమాధానంగా.

"సమోసాలు కామెడీ ఏమిటీ" అన్నాడు ఆయన.

"అదే సర్. సినిమా మాట ఎలా ఉన్నా సమోసాలయినా బావుంటాయి కదా అని ఒక ప్లేటు కొన్నాను.  చూశారూ, సినిమా టిక్కెట్టు ఎనిమిది డాలర్లు. సమోసా నాలుగు డాలర్లు. వెధవ అమెరికా దేశం అంతా కామెడియే! ఏమంటారు?".

ఆయన ఏమీ అనకుండా రెండు చేతులలోనూ ఉన్న నాలుగు సమోసా ప్లేట్లనీ చూడ్డం మొదలుపెట్టాడు మొహం ఆ.మొ.లాగా పెట్టి.

